క్లుప్తంగా

యాసంగికి నీటిని విడుదల చేయాలి

దేవరకొండ : డిండి ప్రాజెక్టు నుంచి యాసంగికి నీటిని విడుదల చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పత్తి, వరి పంటలు చేతికి రాక రైతులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగిలో నీటిని విడుదల చేస్తే ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు కొంత మేర అయిన మేలు జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యసాధనకు కృషి చేయాలని వివేకానంద ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ తరగతిగది నుండే ప్రారంభమవుతుందని, విద్యార్థులు తాము ఎంచుకునే వృత్తి విద్యా కోర్సుల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


సుశాంత్

మిర్యాలగూడ టౌన్ : సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా నుంచి మిర్యాలగూడ మండలంలం తడకమళ్ల గ్రామానికి చెందిన జిల్లా సుశాంత్ ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి బయ్యన్న శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 19వతేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని భిలాయ్‌లో నిర్వహించనున్న పోటీల్లో సుశాంత్ పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుశాంత్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కూడా తన ప్రతిభను కనబరిచి గ్రామానికి, జిల్లాకు మంచి గుర్తింపు జాతీయ స్థాయిలో తీసుకవస్తానంటూ దీమా వ్యక్తం చేశాడు. తడకమళ్ల గ్రామం నుంచి జిల్లా సుశాంత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

వరి విత్తనాలపై రైతులకు అవగాహన

మాడుగులపల్లి : మండలంలోని కల్వెలపాలెం గ్రామంలో శనివారం రైతులకు మహేంద్ర సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. మార్కెట్లోకి రానున్న కొత్త రకం వరి వంగడాల గురించి, నూతన వరి వంగడాల రూపకల్పనలో తమ సంస్థ కృషిని తెలియజేశారు. సన్నరకం ఎంపీఆర్ 505 వంగడం సాగు విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర సీడ్స్ సంస్థ జోనల్ మేనేజర్ చైతన్య, టెరిటరీ మేనేజర్ అనిల్, సూర్యాపేట, మిర్యాలగూడకు చెందిన ఎడ్స్ డిస్ట్రిబ్యూటర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వేములపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధులకు, వితంతువులకు రూ.4వేల పింఛన్, రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేషనల్ కోఆర్డినేటర్ దాసరి రవి, నాయకులు అజార్, కొమ్ము వెంకన్న, పెదసైదులు, బొంగర్ల వినోద్, నగేష్, గురవయ్య, మిన్నయ్య, శ్రీకాంత్, చంటి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజ అభివృద్ధి

వేములపల్లి : విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని స్వచ్ఛ హృదయ సేవా వికాస్ సమితి జిల్లా కోఆర్డినేటర్ జాన్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని రావులపెంట గ్రామంలో వయోజన విద్యా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వయోజనులకు పుస్తకాలు, పలకలు, మొక్కలను, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రాజారత్నం, ఆనంద్, జాన్సన్, నితిన్‌కుమార్, సూరి, పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

త్రిపురారం: గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన త్రిపురారం మండలంలోని అంజనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజనపల్లి గ్రామానికి చెందిన గుండెపురి సత్యనారాయణ తన ఇంటికి తాళం వేసి సొంత పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లి వారం రోజుల తర్వాత శనివారం తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 8 తులాల బంగారం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

వాడవాడలా బతుకమ్మ వేడుకలు

'ఏమేమి పువ్వపునే గౌరమ్మ, ఏమేమి కాయప్పునే గౌరమ్మ' 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో' అంటూ వాడ వాడలా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. గునుగు, తంగేడు, కట్ల, బంతి, చామంతి తీరొక్క పూలను తీసుకొచ్చి బతుకమ్మను అందంగా పేర్చి, సాయంత్రం అంతా ఒక చోట బతుకమ్మలను చేర్చి మహిళలు, చిన్నారులు సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– సాక్షినెట్ వర్క్


చింతపల్లి : మాల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హాలియా : కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను పేర్చుతున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్


పెద్దవూర : రామాలయంలో బతుకమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు


మాడుగులపల్లి : గంధ్రవానిగూడెంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


త్రిపురారం : బతుకమ్మను తీసుకెళ్తున్న ఎంపీపీ అనుముల పాండమ్మ


నాగార్జునసాగర్ : పైలాన్‌కాలనీలో బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు


అడవిదేవులపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండల కేంద్రంలో..


కొండమల్లేపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మిర్యాలగూడ టౌన్: శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో..


హాలియా : బతుకమ్మలతో మహిళలు

కేశవపురం వాసికి డాక్టరేట్


డాక్టరేట్ పొందిన బంగారుబాబు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం కేశవపురం గ్రామానికి చెందిన ఆలంపల్లి బంగారు బాబు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీలో రసాయనశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఏకే.దుర్గాభవాని పర్యవేక్షణలో బంగారుబాబు నానో పదార్థాల తయారీ, వాటి అనువర్తనాల మీద చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. బంగారుబాబు 13ఏళ్లుగా ఏపీలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా బోధనారంగంలో రాణిస్తున్నారు. ఆయన ప్రస్తుతం కర్నూల్‌లోని సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్నారు. చిన్న వయస్సులోనే ప్రభుత్వ అధ్యాపకుడిగా ఉద్యోగం పొందిన బంగారుబాబు పరిశోధనా రంగంలో చేసిన కృషికి గాను డాక్టరేట్ పొందాడు. ఈ సందర్భంగా మిత్రులు పి.బాబు, ఎస్.సైదులు, జి.నాగరాజు, పరమేష్, ప్రశాంత్, కుటుంబసభ్యులు అభినందించారు.

లింగరాజుకు డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న లింగరాజు

మిర్యాలగూడ టౌన్ : స్థానిక ఈదులగూడెంకు చెందిన గడ్డం లింగరాజుకు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి డాక్టరేట్ పొందాడు. ఈ డాక్టరేట్‌ను ఆ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో అందజేశారు. 'కాలువ మల్లయ్య నవలలు-వస్తు విశ్లేషణ' అనే అంశంపై ఆచార్య ఎస్ శరత్ జోస్న రాణి పర్యవేక్షణలో లింగరాజు పరిశోధన నిర్వహించారు. అదే విధంగా పరిశోధనలో భాగంగా సామాజిక, రాజకీయ, ఆర్థిక ఆ సమస్యల పరిష్కారానికి మార్గాలను చూపిస్తూ నివేదికతో పాటు దళిత, బహుజనుల రాజ్యాధికారం దక్కించుకోవాలని ఆ పరిశోధనలో కూడా వెల్లడిస్తూ యూనివర్సిటీకి అందజేశారు. వీసీ బీజేరావు, హైకోర్టు రిటైర్డ్ జడ్జి నర్సింహారావులు ఆ డాక్టరేట్ అందజేసినట్లు తెలిపారు.

చివరి భూములకు నీరందించాలి

మిర్యాలగూడ : సాగర్ ఎడమ కాల్వ ద్వారా చివరి భూములకు సరిపడా నీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకునూరి బసవయ్యగౌడ్ అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలంలోని ములకలకాల్వ మేజర్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నర్సిరెడ్డి, సైదులు, నరసింహారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు

డిండి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో (బాలికలు) నిర్వహిస్తున్న తొమ్మిదో జోనల్‌స్థాయి క్రీడా పోటీలు శనివారం కూడా కొనసాగాయి. ఈ క్రీడా పోటీల్లో అండర్ -17 విభాగం 150 మీటర్ల రన్నింగ్‌లో ఎం. నందిని, డిండి (మొదటి స్థానం) పి.యమున, డిండి (రెండో స్థానం), క్యారమ్స్‌లో ఆర్. బబ్లీ, నడిగూడెం(మొదటిస్థానం), ఎస్. శ్రీలక్ష్మి(రెండోస్థానం), 1500మీటర్ల రన్నింగ్‌లో ఎస్.రజిత డిండి, (మొదటి స్థానం), పి. రాజ్యలక్ష్మి, కట్టంగూర్(రెండో స్థానం), సీహెచ్. కవిత, డిండి(మూడోస్థానం), లాంగ్ జంప్‌లో భానుప్రియ, డిండి(మొదటిస్థానం), మహేశ్వరి, నకిరేకల్(రెండోస్థానం), జయంతి, డిండి(మూడోస్థానం)లో విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపాల్ సీహెచ్. పద్మ, జోనల్ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జ్యోతిర్మయిదేవి, ఆర్గనైజింగ్,వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సెక్రటరీ డి.జ్యోతి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ పి.వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని మిర్యాలగూడ డీఎస్పీ పి.వెంకటగిరి అన్నారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని సుమన్ చోటోఖాన్ అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబర్చి పతకాలు సాధించారు. దీంతో వారిని డీఎస్పీ తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమి మాస్టర్ బాణావత్ రామకృష్ణనాయక్, రాజు, పటేల్, కేతావత్ నాగునాయక్, హరినాథ్ పాల్గొన్నారు.

నాయకులు సహకరించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని నాగార్జునసాగర్ సీఐ బీసన్న అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని నాయకునితండాలో ఎన్నికల నియమావళి, ఎన్నికల్లో రాజకీయ నాయకులు అనుసరించాల్సిన పద్ధతులపై గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బీసన్న మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా పాల్పడినట్లయితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో సమసాత్మక ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, స్థానిక సర్పంచ్ మేరావత్ కొండా నాయక్, గ్రామస్తులు ముని పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

పెద్దఅడిశర్లపల్లి : సామాజిక మాధ్యమాలల్లో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని కొండమల్లేపల్లి సీఐ రాఘవేందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో వాట్సాప్ గ్రూప్‌ల అడ్మిన్‌లకు ఆయన అవగాహన కల్పించారు.వాట్సాప్ గ్రూప్‌ల్లో రెచ్చగొట్టే విధంగా ఎలాంటి పోస్టులు వచ్చినా పూర్తి బాధ్యత అడ్మిన్‌లదేనని, ఎలాంటి రెచ్చగొట్టే పోస్టులు చేయకుండా అడ్మిన్‌లు జాగ్రత్త వహించాలన్నారు. ఎస్ఐ రంజిత్ రెడ్డి, గుడిపల్లి పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

నీటి విడుదల పొడిగింపుపై హర్షం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ : మరో ఐదు రోజుల పాటు సాగర్ నీటి విడుదలను పొడిగించడంపై మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల నాగార్జునసాగర్ రిజర్వాయర్ నిండలేదని తెలిపారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ఎండిపోతున్న పంటలను కాపాడేందుకుగాను రైతు పక్షపాతి అయిన సీఎం కేసీఆర్ సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీ ఉన్నప్పటికీ పది రోజులు నీటిని విడుదల చేశారన్నారు. కానీ పొలాలకు నీరు సరిపడా అందకపోవడంతో పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ మరో ఐదు రోజులపాటు నిరంతరంగా నీటిని అందిస్తున్నట్లు ప్రకటించడంపై రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సైదిరెడ్డి, గోవింద రెడ్డి, మన్నెం లింగారెడ్డి పాల్గొన్నారు.

కొండముచ్చుతో కోతుల బెడదకు చెక్


పోరెడ్డిగూడెం గ్రామస్తులు పెంచుతున్న కొండముచ్చు

మాడుగులపల్లి : మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామస్తులు కోతుల బెడదతో పదేండ్లపాటు నానా అవస్థలు పడ్డారు. వానర దండు స్వైర విహారం చేస్తూ పంట పొలాలు, పండ్ల తోటలు, ఇంట్లో పెరటి మొక్కలను సర్వ నాశనం చేసేవి. దుకాణాల్లో, ఇళ్లలో చేతికి దొరికిన వస్తువులను ఎత్తుకుపోయేవి. అడ్డుకున్న వారిపై దాడికి దిగేవి. కోతుల చేష్టలకు విసిగిపోయిన గ్రామస్తులు బాగా ఆలోచించి నష్ట నివారణకు కొండముచ్చును తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మేరకు సర్పంచ్ కోటిరెడ్డి రెండేండ్ల క్రితం పిల్ల కొండముచ్చును రూ. 9 వేలకు కొనుగోలు చేసి తీసుకువచ్చారు. నిత్యం కొండముచ్చుకు మూడు పూటలా భోజనం, పండ్లు, పాలు, అరటిపండ్లు, మంచి ఆహారాన్ని అందిస్తూ పెంపుడు జంతువులా మచ్చిక చేసుకున్నారు. ప్రతిరోజూ పంచాయతీ సిబ్బంది కొండముచ్చును వీధివీధినా తిప్పుతుండడంతో కోతులు భయపడి గ్రామంలోకి రావడం లేదు. దీంతో రెండేండ్లుగా గ్రామస్తులు ప్రశాంతంగా ఉంటున్నారు. పెరటి మొక్కలు, పండ్ల తోటలు, కూరగాయలు నిర్భయంగా సాగు చేసుకుంటున్నామని వారు చెబుతున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


పెద్దవూరలో డబ్బులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చందంపేట : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో శనివారం చందంపేట, నేరెడుగొమ్ము పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చందంపేట ఎస్ఐ క్రాంతికుమార్, నేరెడుగొమ్ము ఎస్ఐ రాజులు మాట్లాడుతూ సోషల్ మీడియాలకు సంబంధించి వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల అడ్మిన్లతో ఆదివారం పోలీస్ స్టేషన్‌లలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు సమావేశానికి రావాల్సిందిగా సూచించారు.

రూ.1.80లక్షలు పట్టివేత

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలో శనివారం వాహనాల తనిఖీల్లో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.1.80లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు చింతపల్లి ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం వద్ద వాహనాల తనిఖీలు చేపడుతుండగా ఈమేరకు నగదును పట్టుకున్నట్లు తెలిపారు.

డిండి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద పోలీసులు శనివారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ. 1,00,500 సీజ్ చేసినట్లు ఎస్ఐ.సైదులు తెలిపారు. వివరాల ప్రకారం డిండి పట్టణానికి చెందిన సింకారి మల్లాజీ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో వ్యాపారం ముగించుకొని తన బొలేరో వాహనంలో డిండికి వస్తున్నాడు. ఈ క్రమంలో వాహన తనిఖీల్లో రూ.100500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పాయింట్ వద్ద శనివారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో దేవరకొండకు చెందిన సముద్రాల వెంకటేశ్వర్లు హైదరాబాద్‌కు వెళ్తుండగా అతడి వద్ద ఉన్న రూ.60వేలను సీజ్ చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఈ తనిఖీల్లో ముబీన్, మరియాదాసు, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

పెద్దవూర : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. శనివారం మండలంలోని పోతునూరు టోల్ ప్లాజా వద్ద, మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తున్న నలుగురు వ్యక్తుల నుంచి రూ.2.84 లక్షలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ అజ్మీరా రమేశ్ తెలిపారు.

అడవిదేవులపల్లి : ఎన్నికల కోడ్‌లో భాగంగా మండల సమీపంలో గల టెయిల్‌పాండ్ ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద ఆంధ్రప్రదేశ్ నుంచి అడవిదేవులపల్లి వస్తున్న వాహనాలను శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.1.11లక్షల నగదును పట్టుకున్నారు. దీంతో ఈ డబ్బులకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు. అదే విధంగా మండలంలో 12 లీటర్ల సారా, ఆరు బెల్ట్ షాపుల్లో 30 లీటర్ల మద్యం సీసాలు కూడా సీజ్ చేసినట్లు తెలిపారు.

దేవరకొండ : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. శనివారం దేవరకొండ పోలీస్ స్టేషన్ వద్ద కొండమల్లేపల్లి వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేయగా శ్రీను అనే వ్యక్తి వద్దగల రూ.76 వేల నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ నాగభూషణ్‌రావు తెలిపారు.

పది లీటర్ల సారాయి పట్టివేత

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొల్‌ముంతల పహాడ్ గ్రామ సమీపంలో దేవరకొండ మండలంలోని బాబ్లతండాకు చెందిన ముధావత్ దాక్య పది లీటర్ల సారాయిని క్యాన్‌లో తీసుకెళ్తుండగా స్థానిక కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించండి


త్రిపురారం : వస్త్రం తండాలో కేంద్ర పథకాలపై ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

త్రిపురారం : వచ్చే ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆదరించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవికుమార్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని మాటూర్, వస్త్రం తండా, గుడి తండా గ్రామాల్లో బీజేపీ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ అభివృద్ధి పథకాలపై గడప గడపకు తిరగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ రవి కుమార్ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ధనుంజయ నాయక్, సైదులు, భాస్కర్, వసంత్, బాబ్లీ, జగన్, సీతారాం, సేవ, శ్రీను, జనత పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యమని ఎన్ఆర్ఐ, ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కొంపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పానుగోతు రవి కుమార్ నాయక్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీపురంతండా, యల్లాపురంతండాలో ఇంటింటికి మోదీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ డబ్బుల సంచులు పంపిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్ నాయక్, నాగేష్ నాయక్, ముని, లక్ష్మణ్, విజయ్, నాగేశ్వరావు, చందు, మంగ్తా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా దమ్మదీక్షా దివస్


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దేవరకొండ : ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 67వ దమ్మదీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు డా.ఏకుల రాజారావు, కంబాలపల్లి వెంకటయ్యలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఇండియా సమతా సైనిక్‌దళ్ జిల్లా నాయకులు ధర్మపురం శ్రీను, సైదులు, కనకాచారి, అంజయ్య, భాస్కరాచారి పాల్గొన్నారు.